క్లుప్తంగా

ఎస్పీకి సన్మానం



ఎస్పీని సన్మానిస్తున్న ప్రతినిధులు

ఆదిలాబాద్‌టౌన్: కరీంనగర్ సీపీగా బదిలీపై వెళ్తున్న జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను హిందూ సమాజ్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. పూలబొకేతో భగవద్గీత, అబ్దుల్ కలాం రచించిన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హిందూ సమాజ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు హన్మండ్లు, భాస్కర్, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉదయ్, సాగర్, జోగు రమేశ్, సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: కరీంనగర్ సీపీగా బదిలీపై వెళ్తున్న ఎస్పీ గౌస్ ఆలంను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎస్పీ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు.

కార్మిక సమావేశాన్ని విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఈనెల 11న జిల్లా కేంద్రంలో నిర్వహించే భవన నిర్మాణ కార్మిక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బజరంగ్ హాల్‌లో నిర్వహించే సమావేశానికి జిల్లా వ్యాప్తంగా కార్మికులు పెద్దఎత్తున హాజరు కావాలన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

సిరికొండ: మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు నేడు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రానున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. మండలానికి మంజూరైన పీహెచ్‌సీ భవనానికి శంకుస్థాపన, అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి భూమిపూజ, ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన సీసీ రోడ్లు, డ్రెయినేజీలు పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

నేడు సావిత్రిబాయి పూలే వర్ధంతి

ఆదిలాబాద్‌రూరల్: భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని సోమవారం నిర్వహిస్తున్నట్లు అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ కార్యాలయ ఆవరణలో ఉదయం 8గంటలకు మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 7 గంటలకు టీచర్స్ కాలనీలోని పూలే గెస్ట్‌హౌస్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

దివ్యాంగ ఉద్యోగుల సంఘ కార్యాలయం ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: దివ్యాంగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తాత్కాలిక నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ఈ కార్యాలయ భవనాన్ని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమాధికారి మిల్కా ముఖ్య అతిథిగా హాజరై ఆదివారం ప్రారంభించారు. దివ్యాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు శాశ్వత సంఘ భవన నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసానిచ్చారు. అనంతరం మిల్కాను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు మహేందర్ రెడ్డి, గంగాదేవి, అలీముద్దీన్, దీపక్, పాల్గొన్నారు.

మహిళల్ని విముక్తి పరిచింది అంబేడ్కరే



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

ఆదిలాబాద్‌రూరల్: మహిళలను విముక్తి పరిచింది భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అని ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భాషెట్టి మాధవ రావు విజ్ఞాన్ కేంద్రంలో ఆదివారం ధర్మ మహిళా జాగృతి రాష్ట్రస్థాయి ఆవిర్భావ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాత్మా జ్యోతి రావు, సావిత్రి బాయి పూలే దంపతులు, బాబా సాహెబ్ అంబేడ్కర్, రామాబాయి అంబేడ్కర్ దంపతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం మహిళలతో కలిసి ధర్మ మహిళా సంఘం బ్యానర్ ఆవిష్కరించారు. మహిళలకు జీవన విధానంతో పాటు తాత్విక పునాదులు కూడా నేర్పాలని, ధైర్యంగా ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నెలా లక్ష్మణ్, అగ్గిమల్ల గణేష్, అన్నెల అడేల్లు, యశోద, మంద జ్యోతి, ఉపాసన, సుశీల, రామగిరి అశ్విని, మంజుషా, దర్శనాల సుష్మా, శ్యామల, వెంకటేశ్ పాల్గొన్నారు.

భయాన్ని వీడితేనే విజయం

- 'పది'పై పట్టు సాధించండి ఇలా
- విద్యార్థులకు ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు



చదువుతున్న విద్యార్థులు

నేరడిగొండ: పదోతరగతి విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ ప్రారంభించారు. మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదల కావడంతో ఉత్తమ ఫలితాల కోసం సాధన ప్రారంభించారు. తొలిసారిగా పబ్లిక్ పరీక్షలకు హాజరు కాబోతుండడంతో కొందరు విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో తెలియక హైరానా పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు, వైద్య నిపుణులు విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ముఖ్యంగా పరీక్షలపై భయం వీడితే విజయం సాధ్యమని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా పదో తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 10,106 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- రాత్రి 10.30 తర్వాత చదవకూడదు. ఒకవేళ చదివినా ఆ సమయంలో 30 శాతం మాత్రమే మన మెదడు గ్రహిస్తుంది.
- తెల్లవారుజామున 4గంటలకు చదివితే మెదడుకు వంద శాతం గ్రహించే శక్తి ఉంటుంది .
- ఎనిమిది గంటలపాటు నిద్ర ఉండాలి.
- సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలి.

వైద్యులు, ఉపాధ్యాయుల సలహాలు..

- పరీక్షల సమయంలో మాంసాహారాలు తీసుకోరాదు. తీసుకుంటే బద్ధకం వస్తుంది.
- ప్రదారోజు ఒక గుడ్డు, ఒక బొప్పాయి ముక్క, ఒక అరటిపండు. ద్రవ పదార్థాలు కలిసిన పుచ్చకాయలు. ఒక గ్లాస్ పాలు, చెరకు రసం తీసుకుంటే ఏకాగ్రత పెరుగుతుంది.
- ఎక్కువగా ద్రవ పదార్థాలతో కూడిన ఆహారం తీసుకోవాలి.
- కొబ్బరి బోండాలు, గ్లూకోజ్ నీటిని అధికంగా వాడాలి.
- సమయానికి భోజనం చేయాలి.
- మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలి.
- పరీక్షకు వెళ్లే ముందు ఒత్తిడిని అధిగమించాలి.

మనుసు ప్రశాంతంగా ఉంచుకోవాలి



బాలికల పాఠశాల ప్రిన్సిపల్, బుగ్గారం పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా మనస్సు ప్రశాంతంగా ఉంచుకుంటే విజయం సాధించవచ్చు. ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. ఎనిమిది గంటల నిద్ర తప్పనిసరి. తెల్లవారుజామున 4 గంటలకు చదివితే ఎక్కువ ఫలితం ఉంటుంది. – కృష్ణవేణి, టీటీడబ్ల్యూఆర్‌జేసీ

పరీక్షలంటే భయపడొద్దు



పదో తరగతి వార్షిక పరీక్షలంటే విద్యార్థులు భయం పెట్టుకోవద్దు. ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. చదివేటప్పుడు సమయం నిర్ణయించుకోవాలి. ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలి. మనస్సు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి.

– డాక్టర్ సద్దాం, పీహెచ్‌సీ, నేరడిగొండ

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం



పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే సిలబస్ పూర్తి చేయించి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు ప్రిపరేటరీ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాలోనే నంబర్ వన్‌గా నిలుస్తాం.

– భూమారెడ్డి, ఎంఈవో, నేరడిగొండ

క్రీడలతో స్నేహభావం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంతంలో క్రీడలు నిర్వహించడం ద్వారా స్నేహభావం ఏర్పడుతుందని ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. ఆదివారం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో ఈగల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఏమాయికుంట గ్రామంలో ఈగల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలో ప్రతిభ కనబరిచిన జట్లకు మొదటి బహుమతి రూ. 1లక్ష, రెండో బహుమతి రూ. 50 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలానికి మంచి పేరు తీసుకోరావాలని ఈగల్ యూత్ సభ్యులకు విన్నవించారు. నాయకులు మీర్జా జీలానిబేగ్, జాదవ్ లఖన్, కోరెంగా సుంకట్ రావ్, ఎండీ జునైద్, చింతవార్ దీపక్ పాల్గొన్నారు.

భారతీయ ఆదివాసీ పర్ధాన్ ఉద్దన్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నగేశ్



మాట్లాడుతున్న దుర్వ నగేశ్

ఆదిలాబాద్‌రూరల్: భారతీయ ఆదివాసీ పర్ధాన్ ఉద్దన్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన దుర్వ నగేశ్ నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్ నగరంలోని మాసబ్ ట్యాంకులో గల ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ కాన్ఫరెన్స్ హాల్‌లో 11 రాష్ట్రాలకు చెందిన నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘటన్ జాతీయ అధ్యక్షుడు కేపీ ప్రధాన్, కోచాడే నారాయణ, మెస్రం ప్రకాష్, కోవా ప్రభకర్, గోడం విఠల్, గోడం లక్ష్మణ్, సిడాం రాంకిషన్, వనిత, మెస్రం గిరిజా పాల్గొన్నారు.

ఏఐటీయూసీ రాష్ట్ర సమావేశంలో దేవేందర్



ప్రగతి నివేదికను చదివి వినిపిస్తున్న దేవేందర్

కైలాస్‌నగర్: ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో గల సంఘ భవనంలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో గతేడాది కాలంలో చేపట్టిన కార్యక్రమాల ప్రగతి నివేదికను ప్రవేశపెట్టారు. అనుబంధ సంఘాలలో పని చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మిలిటెంట్ తరహా పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు.

నేడు ప్రతిష్ఠాపన

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధి ఇప్పమాడ గ్రామంలో సోమవారం అభయాంజనేయస్వామి, శివపంచాయతన, నవగ్రహ, ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పూజాది కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నాయకులు హాజరవుతారని తెలిపారు.

'తక్షణమే పీఆర్‌సీ ప్రకటించాలి'



మాట్లాడుతున్న మూగ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: నూతన పీఆర్‌సీని తక్షణమే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిరకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలన్నారు. ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. సర్వీస్ రూల్స్ సాధించి అన్ని రకాల క్యాడర్లలోని ఖాళీలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బెజ్జంకి రవీంద్ర, దిలేష్ చౌహన్, పుప్పాల నరేందర్, భానోత్ మనోహర్, జాదవ్ రవికుమార్ పాల్గొన్నారు

అ'పూర్వ' సమ్మేళనం



ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): తమ గురువులతో పూర్వ విద్యార్థులు



బేల: పాల్గొన్న పూర్వ విద్యార్థులు

జైనథ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 2002–23 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు, బేల మండలంలోని సిర్సన్న గ్రామంలో 2004–05బ్యాచ్ చెందిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చాలా సంవత్సరాల తరువాత ఒకచోట కలుసుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.

– బేల /ఆదిలాబాద్‌టౌన్(జైనథ్)

ఐక్యంగా ఉంటేనే ధర్మ పరిరక్షణ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: హిందువులు ఐక్యంగా ఉంటేనే ధర్మ పరిరక్షణ సాధ్యమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తాటిగూడ కాలనీలో శ్రీరామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచమంతా భారతదేశం వైపు చూస్తూ ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా హిందువుల పండుగలపై ప్రపంచమంతా చర్చ జరుగుతుందన్నారు. సనాతన ధర్మంపై పరిశోధన జరుగుతోందని, ఈ ధర్మంలో జన్మించడం మనం చేసుకున్న అదృష్టమన్నారు. ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కలిసికట్టుగా సాగాలని సూచించారు. కాలనీవాసులంతా ఆలయ నిర్మాణం కోసం ఏకమై శ్రమించడం గొప్ప విషయమని అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నగేశ్, సన్నీ, అశోక్ రెడ్డి, విశాల్, శివ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వ ఎన్ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం జైనథ్ మండలంలోని న్యూ సాంగి, ఓల్డ్ సాంగిలో రూ. 8 లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కారణంగా అభివృద్ధి పనుల కొంత ఆలస్యమైనట్లుగా పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లుగా వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్ రెడ్డి, అశోక్ రెడ్డి, నగేశ్, విశాల్ వెంకన్న, వైభవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భోరజ్‌మండలంలోని సాంగీ గ్రామంలో నూతన రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహాసభకు తరలివెళ్లిన పద్మశాలీలు



తరలి వెళ్తున్న పద్మశాలి కులస్తులు

ఆదిలాబాద్‌రూరల్: 17వ అఖిలభారత పద్మశాలీ సంఘం జాతీయ మహాసభలు, 8వ తెలంగాణ పద్మశాలి రాష్ట్ర మహాసభలు ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించారు,. మహాసభలకు జిల్లా కేంద్రం నుంచి పలువురు పద్మశాలి కులస్తులు తరలి వెళ్లారు. పద్మశాలి ఐక్యత చాటడమే గాక పలు ప్రధానమైన డిమాండ్లు హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలకు పద్మశాలి సంఘం పిలుపునిచ్చింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలి జనాభాకు అనుగుణంగా సీట్లు కేటాయించాలని పద్మశాలి సంఘం డిమాండ్ చేస్తోంది. కార్యక్రమంలో బేత రమేశ్, జక్కుల సత్యనారాయణ, బొమ్మ కంటి రమేశ్, మోర ఆశన్న, కామని విఠల్, బూర్ల శంకరయ్య, దాసరి ఆశన్న, రాజేశ్వర్, తన్నీర్ నవత, రమాదేవి పాల్గొన్నారు.

బోథ్: హైదరాబాదులో ఆదివారం నిర్వహించిన 17వ అఖిల భారత పద్మశాలి సంఘం సభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభలకు బోథ్ మండల పద్మశాలి సంఘం సభ్యులు తరలివెళ్లారు. ఈసభకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైనట్లు పేర్కొన్నారు. సభకు వెళ్లిన వారిలో మెరుగు భోజన్న, గంగుల మల్లేష్, వడ్లకొండ సురేందర్, కొమారి దయాకర్, సిరిపురం సత్తయ్య, భూస లక్ష్మణ్, కటకం నగేశ్ ఉన్నారు.

మూడు మతాల ప్రతీక 'సిరిచెల్మ మల్లన్న'

- 8, 9 వ శతాబ్దంలో రాష్ట్ర కూటుల కాలంలో నిర్మాణం
- చాళుక్యులు, కాకతీయల కాలంలో ప్రాచుర్యం
- ప్రాచీనమైన దేవాలయాల్లో సిరిచెల్మ ఒక్కటి



సిరిచెల్మ మల్లన్న ఆలయం

ఇచ్చోడ: తెలంగాణ రాష్ట్రంలో అతి ప్రాచీన దేవాలయాల్లో సిరిచెల్మ మల్లికార్జున శివాలయం ఒక్కటి. సిరిచెల్మ గ్రామానికి దక్షిణం వైపున తూర్పు ముఖంగా ఆలయం నిర్మించారు. ఉత్తరాయణంలోని పాల్గుణ మాసంలో పదిహేను రోజులలో సూర్యకిరణాలు ఏడు ధర్వాజల గుండా నంది కొమ్ముల మధ్య నుంచి నేరుగా గర్భగుడిలోని శివలింగంపై పడటం ఈ ఆలయ ప్రత్యేకత.

8వ శతాబ్దంలో నిర్మించిన ప్రధాన ద్వారం..

ప్రధాన దేవాలయ ద్వారం 8వ శతబ్దంలో పరిపాలించిన రాష్ట్ర కుటుల కాలంలో నిర్మించబడింది. ద్వారంపైన గజలక్ష్మి శిల్పంతో పాటు ఇరువైపులా కళశాలు చెక్కబడినాయి. మండపంలో గౌతమ బుద్ధుడు, మాతంగుడు, భక్త హన్మన్, గణపతి, విగ్రహాలున్నాయి. మండపానికి మూడు వైపులా గర్భగుడులు ఉన్నాయి.

సొట్ట శివలింగం ఆలయ ప్రత్యేకత..

గతంలో ఇక్కడి ప్రాంతంలో పిట్టవ్వ, నిమ్మవ్వ అను వైశ్య యువతులు అప్పాలు, గారెలు అమ్ముతూ.. జీవించే వారు. ఒక్కరోజు వారి వద్దకు ఆనాథ బాలుడు వచ్చి ఆశ్రమం కావాలని వారిని ఒప్పించి, మెప్పించి, వారి దూడలకు కాపారిగా ఆశ్రయం పొందాడు. అప్పట్లో తీవ్ర కరువు వచ్చి ప్రజల బాధలను చూడలేక బాలుడు, తట్ట, పారచేత పట్టుకొని చెరువును తవ్వి నెత్తిపై మట్టిని మోస్తు చెరువు కట్టను నిర్మించాడు. నిర్మాణం తర్వాత ఒక్కరోజు ఆదృశ్యం అయి నిమ్మవ్వ, పిట్టవ్వలకు కలలోకి వచ్చి చెరువు మధ్యలో తానే స్వయం భూ శివలింగంగా అవతరించినట్లు వారికి కలలో చెప్పగా, మరుసటి రోజు చెరువులోకి వెళ్లిచూడగా సొట్టపోయిన శివలింగం కనిపించింది.

జైన, బౌద్ధ, హిందు మతాల వాస్తుశిల్పకళ



ఈ ఆలయంలోని వాస్తు శిల్పకళ 8వ శతబ్దం నాటి రాష్ట్ర కుటులు, 10వ శతబ్దం నాటి చాలుక్యుల, 12,13వ శతబ్దం నాటి కాకతీయుల కాలంలో నిర్మించినవి. ఆలయలోని వాస్తు నిర్మాణం, విగ్రహాలు జైన, బౌద్ధంతో పాటు హిందు మతంలోని వైష్ణవ. శైవ మతాలకు చెందిన విగ్రహాలు ఉన్నాయి.

– కటకం మురళి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇచ్చోడ డిగ్రీ కళాశాల

దళితుల డిమాండ్లు నెరవేర్చాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి గంగేశ్

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ దళితుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నేతకాని మహర్ రిజర్వేషన్ పోరాల సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి గంగేశ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో శాంతియుత ధర్నా పోరాట దీక్ష చేపట్టారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూల్లె వెంకటేశ్‌తో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వ పాలకులు, ఇప్పుడున్న ప్రభుత్వ పాలకులు ఏజెన్సీ దళితులను పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములుకు, పోడు భూములకు, కట్టుకున్న ఇండ్లస్థలాలకు పట్టాలు లేక సర్వస్వం కోల్పోయి ఏజెన్సీ ప్రజలు దుర్భరజీవితాలు గడుపుతున్నారన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



పాల్గొన్న మహిళలు

ఆదిలాబాద్‌రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ పట్టణంలోని స్వర్ణకార మహిళలు స్థానిక పార్కులో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ త్యాగానికి మారుపేరు మహిళ అని పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం వెనుక కూడా ఎందరో మహిళల త్యాగం ఉందని గుర్తుచేశారు. మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు తమ శక్తిని తెలుసుకోని అన్నిరంగాల్లో తమను తాము నిరూపించుకోవాలన్నారు.